## అక్రమ అరెస్టులు ఆపాలని వినతి



ఎస్పీకి వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆత్రం సక్కు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 14 : జైనూర్ ఘటనలో ఆదివాసీల అక్రమ అరెస్టులను ఆపాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాలు, రాయి సెంటర్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, ఘటన జరిగి 10 రోజులైనా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు బుర్స పోచయ్య, మాడవి గుణవంత్ రావు, శ్రీనివాస్, సిడం శంకర్ ఉన్నారు.

## కొనసాగుతున్న నీటి విడుదల



ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న వరద

హాజీపూర్, సెప్టెంబర్ 14 : ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, శనివారం 20.1754 టీఎంసీల సామర్థ్యంతో ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు 17326 క్యూ సెక్కుల వరద వచ్చి ప్రాజెక్టులో చేరుతున్నది. హైదరాబాద్ ప్రజల తాగు నీటి అవసరాల కోసం 297 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

# ప్రముఖులు పేక ఆడొచ్చు!

## పెద్దలు పట్టుబడితే వివరాలు గోప్యంగా ఉంచుతున్న పోలీసులు

- పలుకుబడి ఉన్న వ్యక్తులు, వ్యాపారులకు చుట్టంగా చట్టం.. సామాన్యులకు మాత్రం కఠినం
- అనుమానాలు రేకెత్తించేలా ఖాకీల వ్యవహారం



**ఇటీవల** మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పేక ఆడుతూ 9 మంది దొరికారు. వీరిలో ఒకరు జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన త్రీ స్టార్ హోటల్‌లో, టాప్ ఫ్లోర్‌లో స్విమ్మింగ్ పూల్ కలిగిన వాటాదారుడు. మరొకరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో కీలక పార్ట్‌నర్. ఈయన్ని 'టచ్' చేయాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సినంత పలుకుబడి ఉన్న వ్యక్తి. ఇందులో మంచిర్యాల మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భర్త సహా మరో ప్రముఖ వ్యాపార వేత్త కూడా ఉన్నారు. ఇక మిగిలిన వారు సైతం ఎంతోకొంత రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులే. దీంతో ఈ కేసులో పోలీసులు ఇంటి పేర్లతో సహా వివరాలు వెల్లడించలేకపోయారు. జూలై 10న రామగుండం పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ గ్రూప్‌లో ఇంటి పేర్లతో సహా పత్రికా ప్రకటన పెట్టారు. ఆపై వెంటనే పీఆర్వో దాన్ని డిలీట్ చేశారు. కాసేపటికే మంచిర్యాల పోలీసులు ఇంటి పేర్లు లేకుండా మరో ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది ఇంటి పేర్లను కావాలనే గోప్యంగా ఉంచారనే విమర్శలు వచ్చాయి. కమిషనరేట్ గ్రూప్‌లో ఇంటి పేర్లతో సహా పెట్టిన ప్రెస్ రిలీజ్‌ను డిలీట్ చేయించి, లోకల్ పోలీసులు మరొకటి విడుదల చేయడం సీపీకి తెలిసి జరిగిందా.. తెలియక జరిగిందా.. తెలియదుగానీ.. పోలీసుల వ్యవహారంపై మాత్రం తీవ్రమైన చర్చ జరిగింది.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా** కాగజ్‌నగర్ పట్టణంలోని గుంటూరు కాలనీలో సెప్టెంబర్ 1న రాత్రి ఓ ఇంట్లో పేక ఆడుతున్న తొమ్మిది మంది పట్టుపడ్డారు. ఈ ఘటనలో ఎనిమిది మంది పేర్లను ఇంటి పేర్లతో సహా పేర్కొంటూ పత్రికా ప్రకటన ఇచ్చిన పోలీసులు, మంచిర్యాల జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్ కలిగిన ఓ వ్యక్తి ఇంటి పేరును మాత్రం తప్పించారు. దీంతో ఆయన ఎవరో తెలియకుండా పోయింది. దీనిపై కాగజ్‌నగర్‌లో పని చేసే ఓ పోలీసు అధికారిని వివరణ కోరితే.. ఆయన పేరు పెట్టకపోవడానికి 'వాలా' చట్టం ఏదో అడ్డువచ్చిందని వ్యంగ్యంగా పేరు చెప్పకనే చెప్పినట్లు చెప్పారు. ఈ ఘటనలో పట్టుబడిన డబ్బు లెక్కలు చూపించడంలోనూ తేడాలున్నాయనే ఆరోపణలు వచ్చాయి. పోలీసులు మాత్రం అలాంటివేవీ లేవని స్పష్టం చేశారు.

మంచిర్యాల, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చట్టం దృష్టిలో అందరూ సమానమే. కానీ.. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మాత్రం కొందరు పెద్దోళ్లకు ఆ చట్టం చుట్టంగా మారింది. కొంత డబ్బు, పలుకుబడి ఉంటే చాలు ప్రముఖులన్న పేరుతో వారు ఏమైనా చేయవచ్చు అన్నట్లు పోలీసులు వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు. పెద్దమనషులు, వ్యాపారవేత్తల ముసుగులో వాళ్లు ఏం చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తారు. చేసేది ఇల్లీగల్ పని అని తెలిసినా.. వాళ్ల పేర్లు గోప్యంగా ఉంచడం అంటే వాళ్లను ప్రోత్సహించడం కాదా... పేరు బయటికి వస్తే పరువు పోతుందన్న భయానికైనా జూదం ఆడరు కదా... ఈ కోణంలో పోలీసులు ఎందుకు ఆలోచించరనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతున్నది. సామాన్య జూదరులు దొరికితేనేమో వాళ్ల ఇంటి పేర్లు, అడ్రస్‌లతో సహా వివరాలు వెల్లడించే పోలీసులు ప్రముఖులు దొరికినప్పుడు మాత్రం ఇంటి పేరు పెట్టకపోవడమో, తండ్రి పేరు పెట్టకపోవడమో, అడ్రస్ పెట్టకపోవడమో.. చేస్తుంటారు. ఒకవేళ దొరికినా పోలీసులు సహకారం ఉంటుందనే ధీమాతో పేకాట, సట్టా..మట్కావంటి దందాలను ఆ ప్రముఖులే వెనకుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

### ఫోకస్ చేయని పోలీసులు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొన్ని ప్రాంతాల్లో రెగ్యులర్‌గా పేకాట ఆడుతారు. ప్రముఖులు, వ్యాపారవేత్తలు, గవర్నమెంట్ ఉద్యోగులు నిత్యం అక్కడ జూదంలో పాల్గొంటారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని ఫ్లఓవర్ పక్కనున్న ఓ బేకరీలో పెద్దమనషులు చాలా మంది పేకాట ఆడతారు. కానీ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా అక్కడ పోలీసుల రైడ్ జరగలేదు. మంచిర్యాల రెడ్డీ కాలనీలోనూ గత ఆరేడు నెలలుగా పేకాట ఆడుతున్నారు. ఈ రోజు ఒక చోట, రేపు మరో చోట ఇలా నిత్యం లోకేషన్లు మారుస్తూ పేకాట ఆడుతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని రెడ్డీ కాలనీలో కొందరు చెబుతున్నారు. ఈ విషయం పోలీసులకు చెప్పొచ్చు కదా.. అంటే అందులో ప్రముఖులు ఉంటున్నారని, ఫిర్యాదు చేస్తే తమకే ఇబ్బంది వస్తుందేమోనని చేయడం లేదని అంటున్నారు. బైపాస్ రోడ్డులోని రాళ్లపేటలోనూ ప్రభుత్వ ఉద్యోగులు, సెటిలర్లు ఉండే ఓ కాలనీలో సెలవు రోజు వచ్చిందంటే చాలు పేకాట నడుస్తున్నది. ఈ వ్యవహారం గురించి పోలీసులకు సమాచారం లేదా... తెలిసినా కూడా మిన్నకుండి పోతున్నారా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఇక మంచిర్యాలలోని లాడ్జీలు, ప్రముఖ హోటళ్లలో పేకాట అనేది నిత్యకృత్యంగా మారిపోయింది. బెల్లంపల్లి చౌరస్తాలో ఉన్న ఓ లాడ్జిలో నిత్యం ఇలాంటి వ్యవహారమే సాగుతుంది. కానీ అదేదో 'దివ్య'మైన కార్యం అన్నట్లు పోలీసులు పట్టించుకోరు. జైపూర్, లక్షెట్టిపేట మండలాల్లో మామిడితోటలు, ఫామ్ హౌస్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో పేకాట దందా జోరుగా సాగుతున్నది. జైపూర్ మండలంలోని ఓ గ్రామంలో మామిడి తోటలో పేకాట ఆడుతూ నిత్యం పట్టుబడుతున్నా.. దానికి అడ్డుకట్ట వేయడంలో పోలీసులు ఘోరంగా విఫలమవుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జైపూర్ పోలీసులు ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్న కొందరిని పట్టుకున్నారు. వీరిలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉండే ఓ రాజకీయ పార్టీ అధికార ప్రతినిధి పేరును సైతం ఇలాగే గోప్యంగా ఉంచారు.

### పెరుగుతున్న విష సంస్కృతి..

ప్రముఖులు, పెద్దలుగా చలమాని అవుతున్న వారి అండదండలతోనే మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో జూద సంస్కృతి ఎక్కువైపోతున్నది. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని, గత కొన్ని నెలలుగా తీవ్రమైపోయిందని పోలీసు శాఖ అధికారులే చెబుతున్నారు. దాడుల్లో నిత్యం లక్షలాది రూపాయలు దొరుకుతుండడం అధికారులను విస్మయానికి గురి చేస్తున్నది. మంచిర్యాల జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 41 కేసులు నమోదు చేశారు. మొత్తం 295 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.22,98,350 స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో 32 కేసులు నమోదు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సహా కాగజ్‌నగర్ ఏరియాల్లో అయితే నిత్యకృత్యంగా పేకాట, సట్టా..మట్కా ఆడుతున్నా నమోదు చేసే కేసులు మాత్రం నామమాత్రమని తెలుస్తున్నది.

### ఎవరి పేర్లు దాచొద్దని చెప్పాం



జూదం ఆడుతూ పట్టుబడ్డ వారు ఎవరైనా సరే పేర్లు గోప్యంగా ఉంచాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులందరికీ కఠినమైన ఆదేశాలు ఇచ్చాం. ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలుంటాయి. చట్టానికి ఎవరూ అతీతులు కారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో నిత్యం నిఘా పెడుతున్నాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నాం. **- ఎం.శ్రీనివాస్, రామగుండం సీపీ**

## కాగజ్‌నగర్ డీఎస్పీగా రామనుజం




కాగజ్‌నగర్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రామనుజం

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14 : కాగజ్‌నగర్ డివిజన్ డీఎస్పీగా రామనుజం శనివారం బాధ్యతలు చేట్టారు. కరీంనగర్ పీటీసీ నుంచి బదిలీపై వచ్చిన ఆయనను పట్టణ సీఐ శంకరయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్‌కు బదిలీపై వెళ్లిన విషయం విదితమే.

## సర్వేపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, సెప్టెంబర్ 14 : ఓటరు జాబితా సర్వేపై బీఎల్‌వోలు నిర్లక్ష్యం చేయవద్దని, గడువులోగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం దేవాపూర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు జాబితా సమగ్ర సర్వేను పరిశీలించారు. ఇంటింటి సర్వే ఆలస్యంగా కొనసాగుతుండగా, బీఎల్‌వోలను మందలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం దేవాపూర్ గ్రామ పంచాయతీలో గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 : పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ దీపక్ కుమార్ సందర్శించారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు జాబితా సమగ్ర సర్వేను స్వయంగా పర్యవేక్షించారు. బూత్ నం.86, యువ సంఘటన్ పాఠశాలలో జరుగుతున్న ఓటర్ జాబితా సర్వే గురించి అంగన్‌వాడీ టీచర్, బూత్ లెవెల్ ఆఫీసర్ స్వరూపను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటర్ జాబితాలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఇప్పటి వరకు ఎంతమంది ఇళ్లలో సర్వే పూర్తి చేశారు అని ప్రశ్నించారు.



కాసిపేట : దేవాపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## సీవోఈని సందర్శించిన హ్యూమన్ రైట్స్ సభ్యులు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 14 : బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలను నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ సభ్యులు శనివారం సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతంలో భోజనంలో పురుగులు వచ్చాయని, ఇప్పుడు అలాంటిదేమీ లేదని విద్యార్థులు తెలిపారు. మినరల్ వాటర్ అందించాలని వారు కోరినట్లు సభ్యులు తెలిపారు.



ఇటీవల పెంచికల్‌పేట్‌లో 21 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

# జోరుగా రేషన్ దందా

## జిల్లా నుంచి యథేచ్ఛగా మహారాష్ట్రకు మన బియ్యం తరలింపు

- టాస్క్‌ఫోర్స్ దాడులు జరుగుతున్నా ఆగని రవాణా
- నిత్యం ఎక్కడో చోట పట్టుబడుతున్న వైనం
- ఇక్కడ కిలోకు రూ. 12 చొప్పన కొని.. అక్కడ రూ. 20కి విక్రయిస్తున్న వ్యాపారులు
- స్థానిక అధికారుల పాత్రపై అనుమానాలు?

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిపోతున్నది. కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి వివిధ మార్గాల్లో రవాణా చేస్తూ సొమ్ముచేసుకోవడం పరిపాటిగా మారింది. టాస్క్‌ఫోర్స్ దాడులు చేస్తూ నిత్యం ఎక్కడో ఒకచోట పట్టుకుంటున్నా.. దందాకు బ్రేక్ పడడం లేదు. స్థానిక అధికారుల అండదండలు, రాజకీయ నాయకుల సహాయ సహకారాలతోనే ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కిలోకు రూ.12కు కొని.. రూ. 20కు అమ్మి

జిల్లాలోని సరిహద్దు మండలాల నుంచి కొందరు వ్యాపారులు రేషన్ బియ్యం దందా జోరుగా సాగిస్తున్నారు. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి, రెబ్బెన నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్–టీ మీదుగా చౌక బియ్యాన్ని పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు. జిల్లా నుంచి మహారాష్ట్ర వరకు ఎక్కడా చెక్‌పోస్టులు లేకపోవడంతో వీరికి కలసివస్తున్నది. ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం ప్రారంభమైనప్పటి నుంచి దందా మొదలవుతున్నది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్ డీలర్లు షాప్‌నకు వచ్చే లబ్ధిదారుల వద్దే బియ్యం కొనుగోలు చేసి దందా సాగిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు రేషన్ డీలర్ల వద్ద నేరుగా కొనుగోలు చేసి సిర్పూర్–టీ మండలంలోని వెంట్రావ్‌పేట్, వాంకిడికి తరలించి, అక్కడి నుంచి మహారాష్ట్రకు చేరవేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్‌లలో సరిహద్దులోని గ్రామాలకు తరలించి, అక్కడి గోదాముల్లో డంప్ చేస్తుంటారు. అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొందియా, బల్హార్షాల్లోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఇక్కడ కిలోకు రూ. 12 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మహారాష్ట్రలో రూ. 20 చొప్పున విక్రయిస్తున్నారు. కేవలం 10 రోజుల్లోనే సుమారు 200 క్వింటాళ్ల బియ్యం దాకా పట్టుబడ్డాయంటే ఈ దందా ఏ మేరకు సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహిస్తే తప్ప స్థానిక అధికారులు బియ్యం రవాణాను అడ్డుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో స్థానిక అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతోందన్న ఆరోపణలకు బలం చేకూరుతున్నది.



రెండు రోజుల క్రితం బెజ్జూర్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం























